01ATP24F_01ATP24F.qxd 25-03-2026 AM 12:05 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 25 మార్చి 2026 పేజీలు : 04


# సీఎం చంద్రబాబుతో మంచో ఫెర్రర్ భేటీ

- సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు



**అనంతపురం, మార్చి 24, (ప్రభాతవార్త బ్యూరో)**

రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని విజయవాడలో క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు మాంచో ఫెర్రర్ కలిశారు. ఆర్డీటీ సంస్థ ఏపీలో దశాబ్దాలుగా పేదలకు తన సేవలందిస్తోంది. కొద్ది కాలంగా ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టులోని నిబంధనల కారణంగా ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులు నిలిచిపోయాయి. ఈ సమస్యను పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు... కేంద్రమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు. తాజాగా దీనికి సంబంధించి కేంద్రం నుంచి క్లియరెన్స్ రావడంతో అడ్డంకులు తొలిగాయి. దీనికి కృతజ్ఞతగా మాంచో ఫెర్రర్ సీఎం చంద్రబాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర నిర్ణయంతో పేదలకు ఎప్పటిలా నిరాటంకంగా సేవలు అందుతాయని సీఎం అన్నారు. ఇదే సమయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ని కూడా ఆర్ డి టి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి పయ్యావుల కేశవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

← మంత్రి నారా లోకేష్ ని కలిసిన ఆర్డిటి డైరెక్టర్ మంచో ఫెర్రర్ తదితరులు

# జిల్లా ప్రజలకు తీపి కబురు..ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ

- వెల్లడించిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ - చంద్రబాబు, లోకేష్, అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాతవార్త**

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు తీపి కబురు అందిందని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేశామని కేంద్రం ప్రభుత్వం వెల్లడించిందని ఈ మేరకు తనకు ఫోన్ ద్వారా సమాచారం అందిందని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మంగళవారం ఆయన సమాచార పౌరసంబంధాలశాఖ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో అంత్యంత కీలకమైన ఆర్డీటీ



రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో ఆర్డీటీ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు ఫెర్రర్ (ఫైల్)

సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయడంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కీలకంగా వ్యవహరించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయడంతో జిల్లాలో ఆర్డీటీ సేవలు యధాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. తమ కూటమి ప్రభుత్వానికి జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయడం గొప్ప నిదర్శనం అని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# ఆర్డీటీకి ఎఫ్‌సి ఆర్ ఏ రావడం మహదానందం

ఎమ్మెల్యేలు కాలువ, సురేంద్రబాబు, ఎమ్మెస్ రాజు వెల్లడి కేక్ చేసి సంబరాలు చేసుకున్న టిడిపి ఎమ్మెల్యేలు నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

**అనంతపురం, మార్చి 24, (ప్రభాతవార్త బ్యూరో)**

పేదల ఆశాజ్యోతి ఆర్డిటి సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ. అనుమతి లభించడం మహదానందంగా ఉందని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమినేని సురేంద్రబాబు, ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబుల ప్రత్యేక కృషి వల్లే ఇది సాధ్యమైందని అనంతపురంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఎఫ్ సి ఆర్ ఏ పునరుద్ధరణ కు ఎదురైన అనేక సాంకేతిక సమస్యలను అధిగమించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతాపూర్వకంగా కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వ విజ్ఞప్తిపై కేంద్రం లోని ఎన్డీయే సర్కారు సానుకూలంగా స్పందించడం హర్షణీయమన్నారు. జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని టిడిపి ఎమ్మెల్యేలు కాలువ శ్రీనివాసులు, తదితరులు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబుల సహకారంతో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఢిల్లీ వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశామన్నారు. ఈ బృందంలో ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వనవాసి (సాన) సతీష్ బాబు, బి.కె. పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు తానూ పరిటాల సునీతమ్మ, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి ప్రసాద్, ఎం.ఎస్. రాజు, ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ తదితరులు ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. కేంద్రంతో ఒప్పించడానికి తమ వంతు సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బాబులు హామీ ఇచ్చారని, నేడు ఆ హామీని సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతం పట్ల, పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావం, చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైందన్నారు. ఆర్డీటీ సంస్థ సేవలు అనంతపురం జిల్లాతో విడదీయలేనివన్నారు. ఎఫ్‌సీఆర్ఏ అనుమతుల సాధన కోసం తమ విజ్ఞప్తిని మన్నించి, నిరంతరం పర్యవేక్షిస్తూ, అడ్డంకులను తొలగించి పునరుద్ధరణకు కృషి చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇది ఒక సంస్థ విజయం కాదని, వేలాది మంది పేదల ఆశల విజయమని కాలవ అభిప్రాయపడ్డారు. నిధుల కొరతతో సేవా కార్యక్రమాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని, సాంకేతిక ఇబ్బందులను తొలగించడంలో మంత్రులు పోషించిన పాత్ర అద్భుతమని, ఈ పునరుద్ధరణ వల్ల విద్య, వైద్యం మరియు గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆర్డీటీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు .ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ శ్రీరామనవమి కానుకని ఎమ్మెల్యేలు వెల్లడి ఆర్డీటీకి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ సమస్య 2022లోనే వచ్చిందని.. ఆ రోజే వైసీపీ నాయకులు సరిగా స్పందించి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సురేంద్రబాబు తదితర ఎమ్మెల్యేలు విమర్శలు చేశారు. ఆర్డీటీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సేవలందిస్తున్న సంస్థ అన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడల్లో అనేక సేవలందించారన్నారు. విన్సెంట్ ఫెర్రర్ దగ్గర నుంచి మాంఛో ఫెర్రర్ వరకు వారు చేసిన కార్యక్రమాలు వెలకట్టలేనివన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నుంచే ఆర్డిటికీ నిధులు రాకుండా ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ వారు ఏ రోజు దీని గురించి పట్టించుకోలేదన్నారు. ఈ 20 నెలల కాలంలో జిల్లా ఎమ్మెల్యేలు రాష్ట్రంలో ఎంపీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన సమయంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా ఒక హామీ ఇచ్చారని... ఇచ్చిన హామీ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా తో మాట్లాడి ఆర్డిటికి ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యూవల్ చేయించారన్నారు. మరో ఐదేళ్లపాటు విదేశీ నిధులు రావడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ఆర్డిటి సేవలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ వలనే ఇది సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం మా తెలుగు రాష్ట్రాల ప్రజలకు శ్రీరామ నవమి సందర్భంగా అందించిన కానుకగా ఇది భావిస్తున్నామని తెలిపారు.

# హత్య కేసులో ఐదుగురు నిందితులు అరెస్టు

48 గంటల్లో కేసు చేధింపు

**అనంతపురం క్రైమ్ మార్చి 24 ప్రభాతవార్త**

రెండ్రోజుల కిందట అనంతపురంలో జరిగిన హత్య కేసులో ఐదుగురు నిందితులు అరెస్టు చేసినట్లు అనంతపురం త్రీ టౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ వెల్లడించారు. అరెస్టయిన నిందితులు వివరాలు ఇలా ఉన్నాయి. 1.కరమల్ల హుమాయూన్ బన్నీ దూదే కుల హుమాయూన్, వయస్సు 23 సం.లు., వేణుగోపాల్ నగర్, అనంతపురం 2.పోచంరెడ్డి కరుణాకర్ రెడ్డి, వయస్సు 20 సం.లు., నీరుగంటి వీధి, అనంతపురం 3.కుమ్మర రాకేష్, వయస్సు 21 సం.లు, రాణినగర్, అనంతపురం. 4.బోయపాటి అస్మిత్ చౌదరి, వయస్సు 19 సం.లు, ఘంటాపురం గ్రామము, బత్తలపల్లి మండలం, శ్రీసత్యసాయి జిల్లా. 5. బండి ఉజ్జినప్ప, వయస్సు 20 సం.లు, గంటాపురం గ్రామము, బత్తలపల్లి మండలం, శ్రీ సత్య సాయి జిల్లా. అనంతపురం శిగిది బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఈనెల 22న అర్ధరాత్రి సమయంలో జరిగిన ఘటనలో ఆకుల వంశీ కృష్ణపై పాత కక్షతో దాడి చేయాలని యోచించిన నిందితులు, అతనితో పాటు ఉన్న ఆదర్శ్ నాయుడిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో ఆదర్శ్ నాయుడు తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో పాటు, నిందితుల్లో ఒకరు పదునైన టైల్ ముక్కతో ఛాతి భాగంలో పొడవడంతో అక్కడికక్కడే మరణించాడు. ప్రధాన నిందితుడు కరమల్ల హుమాయూన్ అలియాస్ బన్నీకి, వంశీ కృష్ణతో రెండేళ్ల క్రితం జరిగిన గొడవ కారణంగా వ్యక్తిగత విరోధం ఉందన్నారు. అప్పటి నుంచి ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తూ, సరైన అవకాశం కోసం ఎదురుచూశాడు. ఘటన జరిగిన రోజు తన స్నేహితులతో కలిసి ముందుగా ప్రణాళిక రచించి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన అనంతపురం మూడవ పట్టణ పోలీసులు, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఇన్స్పెక్టర్ రాజేంద్రనాథ్ యాదవ్ నాయకత్వంలో, ఎస్ఐలు, సిబ్బంది కలిసి నిందితుల కదలికలను గమనించి, మంగళవారం మధ్యాహ్నం గుత్తి రోడ్ మార్కెట్ యార్డ్ వద్ద ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

# ఎట్టికేలకు ఆర్డీటీకి ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్స్ మంజూరు

- ❖ ఫలించిన జిల్లా టిడిపి నేతల ప్రయత్నాలు - ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్
- ❖ ఒత్తిడి తెచ్చిన ప్రతిపక్షాలు ప్రజాసంఘాలు,అల్టిమేటం ఇచ్చిన వైసిపి జిల్లా నేతలు
- ❖ మంగళవారం తెల్లవారుజామున కేంద్ర హోం శాఖ నుంచి అనుమతులు రాక
- ❖ సంబరాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజానీకం
- ❖ కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్న టిడిపి ఎమ్మెల్యేలు ❖ నేడు జిల్లాకు ఆర్డిటి ముఖ్యులు మంచో ఫెర్రర్ రాక





కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్న టిడిపి ఎమ్మెల్యేలు

**అనంతపురం , మార్చి 24, (ప్రభాతవార్త బ్యూరో)**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండగ వాతావరణం నెలకొంది. నాలుగు దశాబ్దాల కాలం నుంచి జిల్లా ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని ఆపన్న హస్తం లా నిలబడిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ( ఆర్. డి. టీ) కి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగించే విధంగా ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్సు ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడంతో ఎటు చూసినా ఆనందోత్సవాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కేంద్ర హోంశాఖ నుంచి ఆడింటికి ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెల్లడంతో ఆర్డిటి సంస్థ కు ఊరట ఇచ్చినట్లు అయింది. ఈ సమాచారం ఆర్డిటి సంస్థ సిబ్బంది, అధికారంతోపాటు రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నేతలు కార్యకర్తల్లో కూడా ఆనందోత్స వాలను నింపింది. రాజకీయాలకు అతీతంగా ఆర్ డి టి సేవలందించడంతో అన్ని పార్టీల్లోనూ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఆ సంస్థ పై మంచి పేరు ఉండడం వల్లే లైసెన్సు మంజూరయ్యేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లా టిడిపి నేతలు , ప్రజాప్రతినిల విశ్వ ప్రయత్నాలు ఫలించినట్లు అయింది. ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్సును రెన్యువల్ చేయించి తీరుతానని జిల్లా ప్రజలకు నా మాటగా చెప్పండి అంటూ మంత్రి నారా లోకేష్ పలుసార్లు జిల్లా ఎమ్మెల్యే దగ్గర ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు అయింది. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ స్వయంగా ఆర్డిటి చేస్తున్న సేవలు గురించి కేంద్రానికి నివేదించడంతోపాటు ఎంపీ లు శ్రీకృష్ణదేవరాయలు, సతీష్ తదితరుల టిడిపి ఎంపీల బృందం కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఆర్ డి టి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ తో కలిసి తరచూ సంప్రదింపులు జరపడం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు అయింది. జిల్లా ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు, ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత తదితర ప్రజా ప్రతినిధులు, నేతలు సీఎంను, మంత్రులను తరచూ కలుస్తూ ఒత్తిడి తేవడం కూడా ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్సు రావడానికి అవకాశం ఏర్పడింది. ఇదే సమయంలో ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్సు నిలుపుదలపై జిల్లాలోని ప్రజాసంఘాలు ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ సంఘాలు సేవ్ ఆర్ డి టి పేరుతో ఆందోళన నిర్వహించడం కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి పెంచాయి. సాకే హరి కన్వీనర్ గా వివిధ ప్రజా సంఘాలు, కమిటీలతో ఆందోళనలు కూడా జరిగాయి. సిపిఐ, సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు కూడా తమదైన శైలిలో గట్టిగానే ఉద్యమించాయి. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైసీపీ సమన్వయకర్తలు ఆధ్వర్యంలో వైసిపి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని, పాదయాత్రని కూడా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన లోగా ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్స్ మంజూరు చేయకపోతే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింప చేస్తామని వైసిపి, సిపిఐ, తదితర పార్టీల నేతలు, అఖిలపక్ష కమిటీ ఇటీవల కాలంలో గట్టిగా హెచ్చరికలు చేస్తూ అల్టిమేట్ కూడా ఇచ్చిన విషయం తెలిసిందే.. ఏది ఏమైనా ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ లైసెన్స్ మంజూరు కావడం విశేషం. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఆంధ్ర, తెలంగాణ జిల్లాల్లో పలు జిల్లాలో ఆర్.డి.టి సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడింది.



1969లో ఆర్డిటి సంస్థ అనంతపురం జిల్లాలో దివంగత విన్సెంట్ ఫెర్రర్ నేతృత్వం లో ఏర్పడింది. రాజకీయాలకు అతీతంగా, లాభా పేక్ష లేకుండా ఒక మిషన్ లా రాష్ట్ర ప్రభుత్వానికి సమాంతరంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. ప్రతి ఏటా 350 నుంచి 500 కోట్ల వరకు ఎఫ్ సి ఆర్ ఎ లైసెన్స్ ద్వారా వచ్చే విదేశీ నిధులతో వివిధ పథకాల కింద ఎన్నో సేవా , అభివృద్ధి కార్యక్రమాలను ఆర్డిటి చేస్తూ వచ్చింది. అయితే 2025 సంవత్సరం ఏప్రిల్ 21వ తేదీన ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఎల్ లైసెన్సును కేంద్ర హోంశాఖ నిలుపుదల చేయడంతో ఆడిటీ సంస్థకు విదేశీ నిధులు ఆగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఇన్నాళ్లు ఆర్ డి టి సంస్థను నెట్టుకొ చ్చేందుకు కొన్ని స్థలాలను కూడా ఆ సంస్థ అమ్మాల్సి వచ్చింది. మంత్రి నారా లోకేష్ చొరవ, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రయత్నాల వల్ల ఆర్డిటి సమస్యకు ఎఫ్ సి ఆర్ ఏ పాత లైసెన్స్ పునరుద్ధరించలేము కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో 2025 సంవత్సరం మే 16వ తేదీన కొత్తగా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంది. కేంద్రం అడిగిన అన్ని నివేదికలు ఆర్డిటి సమర్పించిన ఇన్నాళ్లు జాప్యం జరుగుతూ వచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, తదితర కేంద్ర పెద్దలను ఒప్పించేందుకు ఎంతో సమయం పట్టింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో పలు సంస్థలు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని, మతమార్పిడిని ప్రోత్సహిస్తున్నాయని, ఎఫ్ సి ఆర్ ఏ నిబంధనలు పాటించలేదని తదితర ఆరోపణలతో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం పలు సంస్థలకు ఎఫ్ సి ఆర్ ఎ లైసెన్సులు నిలుపుదల చేసింది. అందులో భాగంగా ఆర్ డి టి సంస్థ కూడా విదేశీ నిధులు రాకుండా లైసెన్సులు నిరుదలు చేసింది. దేశంలో ఇతర సంస్థల గాడిన ఆర్డిటిని కలప వద్దు అని , ఆర్డిటి ఎన్నో సేవా , అభివృద్ధి కార్యక్రమాలను చేస్తోందని ప్రత్యక్షంగా టిడిపి జిల్లా , రాష్ట్ర నేతలు చేసిన గట్టి ప్రయత్నాలు, అఖిలపక్షం, ప్రజా, కుల సంఘాలు చేసిన పోరాటం ఎట్టికేలకు ఫలించినట్లు అయింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కూడా అభినందించాల్సిందే.. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెస్ రాజు, దగ్గుబాటి ప్రసాద్, తదితర టిడిపి నేతలు మంగళవారం రహదారుల భవనాల శాఖ అతిథి గృహంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.

# ఆర్డీటీ సమస్యను పరిష్కరించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ధన్యవాదాలు

- ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎం,చంద్రబాబు, మంత్రి లోకేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు... ఎమ్మెల్యే రాజు.

**మడకశిర టౌన్ మార్చి 24 ప్రభాతవార్త**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వేలాది గ్రామాల్లో స్వచ్ఛంద సేవలందిస్తున్న ఆర్డీటీ,రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్, ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించిన ప్రధానమంత్రివర్యులు శ్రీ నరేంద్ర మోడీకు కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు అమిత్ షా కు, కేంద్ర ప్రభుత్వానికి శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ తరపున, ఉమ్మడి అనంతపురం ప్రజల తరపున, ఆర్డీటీ ద్వారా లబ్ధిపొందిన లక్షలాది మంది ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి ఆర్డీటీ సంస్థ ఎఫ్.సీ.ఆర్.ఏ,ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ అకౌంట్ రెన్యూవల్ విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీని వల్ల పేద ప్రజలకు సేవలందించేందుకు ఆర్డీటీ సంస్థ తీవ్ర అవస్థలను ఎదుర్కొంటోంది ఉన్నారు. దీనిపై ప్రధాని మోడీ ను, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ను, కేంద్ర మంత్రులను కలిసి సమస్యను విన్నవించిన సమయంలో వారు సానుకూలంగా స్పందించడం, నేడు ఆ సమస్యను పరిష్కరించడం ఏపీ ప్రజల సంక్షేమంపై కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించడానికి నిదర్శనంగా భావిస్తున్నాను అని అన్నారు. ఆర్డీటీ సమస్యను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.



మంచు ఫెర్రర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

# ఆందోళనలో అరటి సాగు రైతులు...!

- ❖ ఆందోళనలో అరటి సాగు రైతులు...!
- ❖ మొన్న ఆనందం... నేడు విషాదం....
- ❖ ధరలు పతనం... రైతన్న ఇంట కన్నీరు..

**ధర్మవరం రూరల్ మార్చి 24 ప్రభాతవార్త**

ప్రతి ఏటా వర్షాధారం కింద వేరుశనగ చిరుధాన్యపు పంటలు సాగు చేసి నష్టాలు చవిచూసినా రైతన్నలు పండ్ల తోటల సాగుపై మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో అరటి సాగు దాదాపు వేల హెక్టార్లో సాగు చేశారు. 20 రోజుల క్రితం అరటి రైతులు ధరలను చూసి ఆనందపడ్డారు. ప్రస్తుతం పలుకుతున్న ధరలు చూసిన అరటి సాగు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తరలు పతనం కావడంతో రైతన్న ఇంట కన్నీటి గాథ వినిపిస్తుంది. వ్యాపారులు యుద్ధం పేరుతో ఎగుమతులు లేవని ఉన్న ధరలను కూడా తగ్గించి టన్ను 5000 నుంచి 6000 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా దాదాపు 20వేల హెక్టార్లకు పైగా దీర్ఘకాలిక వాణిజ్య పంట అరటి సాగు చేశారు. యాజమాన్య పద్ధతిలో ఎకరంలో అరటి సాగు కోసం సుమారు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా రూ. లక్షలు పెట్టుబడితో అరటి సాగు చేశారు. ధరలు లేక పెట్టుబడులు దక్కక అన్నదాతలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చేసిన అప్పులు తీర్చలేక ఆర్థికంగా చితికి పోవలసిన దుస్థితి నెలకొందని అరటి సాగు రైతులు వ్యక్తం చేస్తున్నారు... అన్నదాతను ఆదుకోకుంటే ఆర్థికంగా చితికి పోవాల్సిందే... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరటి సాగు రైతులు ఆదుకోకుంటే ఆర్థికంగా చితికి పోవలసిన దుస్థితి నెలకొంది. రైతన్నలు దీర్ఘకాలిక పంటల వైపు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి బ్యాంకులో బంగారు నగలు తాకట్టు బోర్లు వేయించారు. వందల అడుగులు బోర్లు తవ్వించి నీటి చెవ్వలేక నిరుత్సాహపడ్డారు. కానీ పట్టు వీడిని విక్రమార్కుల వలె రైతన్న లో పాతాళ గంగమ్మను తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. ఇంచు రొండించులు నీళ్ల బోరు బావుల్లో వస్తున్న వాటికి బిందు సేద్యపు పరికరాల ఆధారంగా అరటి పంటను లక్షలు వెచ్చించి సాగు చేశారు. పంట దిగుబడి బాగుందని సంబరపడ్డారు. ఎగుమతులు లేవని ధరలు పతనం కావడంతో అరటి సాగు రైతులు పంట దిగుబడిని చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత కండగా నిలిచి గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతన్నలు రైతు సంఘం నాయకులు పెద్దన్న కోరుతున్నారు.



వ్యాపారులు రాక చెట్టుపై అరటి గెలను చూపుతున్న రైతు



గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాలను కోరుతున్న రైతు సంఘం నాయకులు

# కాపునాడు అధ్యక్షునిగా మహేష్

బలిజ కులస్తుల హర్షం

**హిందూపురం మార్చి 24 ప్రభాతవార్త**

అందరివాడుగా గుర్తింపు పొంది న ఎస్.ఆర్. మహేష్ కుమార్ హిందూపురం నియోజకవర్గంలో కాపునాడు అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు కాపునాడు జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్, కాపునాడు రాయలసీమ అధ్యక్షుడు పూల పాండురంగ మంగళవారం ప్రకటించారు. ఈ నియామకంపై బలిజ కులస్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. హిందూపురం బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం కమిటీ అధ్యక్షులుగా రెండేళ్లుగా మహేష్ కుమార్ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న బలిజ కులస్తుల అభివృద్ధి, ఐక్యత కోసం పనిచేస్తూ వివాద రహితుడుగా మంచి పేరు తెచ్చుకున్నారు. మరోవైపు పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు పనిచేస్తూ ముఖ్య నాయకునిగా ఎదిగారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బలిజలకు అధిక సీట్లు దక్కేలా తమ కాపునాడు పెద్దలతో కలిసి కృషి చేస్తానని, వారందరి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణదేవరాయల జయంతి ప్రభుత్వం నిర్వహించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పేద విద్యార్థుల చదువు కోసం ఆదుకుంటామని అన్నారు. బలిజల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.



మహేష్ కుమార్

# పునర్విభజన జీవోతో రాజకీయ వర్గాల్లో హీట్..

❖ హిందూపురంలో 45కు పెరగనున్న వార్డులు..? ❖ పార్టీల బలాబలాలపై ప్రభావం

**హిందూపురం మార్చి 24 ప్రభాతవార్త**

నగర పంచాయతీలు మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో 2011 ఓటర్ల సంఖ్య ఆధారంగా వార్డులు సంఖ్యను పెంచుతూ పునర్విభజన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ జారీ చేయడంతో ఒక్కసారిగా రాజకీయ వర్గాలను ముందస్తు హీటెక్కించింది. 30 వేల ఓటర్లు లోపు ఉంటే గరిష్టంగా 23 వార్డులు, అదేవిధంగా 30 నుంచి 40 వేల లోపు ఉన్న ప్రాంతాల్లో 28 వార్డులు, 40 నుంచి 50 వేలు ఓటర్లు ఉంటే 32 వార్డులు, 50 నుంచి 60 వేలు ఓటర్లు ఉన్నచోట 38 వార్డులు, 60 నుంచి 80 వేలు మంది ఉంటే 40 వార్డుల వరకు చేసుకోవచ్చు. 80 నుంచి ఒక లక్ష మంది ఓటర్లు కు 44 వార్డులు, లక్ష నుంచి 1,50,000 మంది ఉంటే 48 వార్డులు, 1,50,000 పైన ఓటర్లు ఉంటే 52 వార్డుల వరకు విభజన చేయవచ్చని విధివిధానాలు రూపొందించారు. కాగా హిందూపురం మున్సిపాలిటీలో 2011 లెక్కల ప్రకారం దాదాపు 1,52,000 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో కౌన్సిల్ స్థానాల సంఖ్య 38 ఉండగా 52 వార్డుల వరకు పెంచుకునే అవకాశం ఉంది. గతంలో 32 నుంచి 38 వార్డులను చేసినప్పుడు ఆనాడు అద్వాన స్థితిలో వార్డుల పునర్విజన జరగడంతో ఓటర్లు, అటు రాజకీయ నాయకులు ఇప్పటికీ తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. సరైన పరిజ్ఞానం, తగిన అర్హత లేని వారితో అప్పుడు వార్డుల పునర్భజన జరగడంతో ఈ దుస్థితి నెలకొంది. త్వరలో జరగనున్న వార్డుల పునర్విజన ప్రక్రియ అయినా సక్రమంగా నిర్వహించాల్సి న బాధ్యత అధికారులపై వుంది. ఇదిలా ఉండగా వార్డుల పునర్విజన ప్రక్రియలో తొలి అంకం నందు మున్సిపాలిటీలో ఎన్ని వార్డులను ఏర్పాటు చేయాలనే సంఖ్యను మొదటగా జిల్లా కలెక్టర్, ఆయా ప్రాంత ఎమ్మెల్యే, అధికారులు నిర్ణయిస్తారు. ఆ తర్వాతే ఓటర్ల సంఖ్యను విభజిస్తారు. ఇంచుమించు అన్ని వార్డుల్లో అతి తక్కువ తేడా మాత్రమే ఉండేలా చూడాల్సి ఉంటుంది. రాజకీయ కోణంలో చూస్తే విభజన అనేది రాజకీయ పార్టీల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా హిందూపురం మున్సిపాలిటీలో ఇప్పటికే ఉన్న వార్డుల్లో సగానికి పైగా ప్రాంతాల్లో ముస్లిం మైనార్టీ చెందిన ఓటర్లు ప్రభావితం చూపుతున్నారు. వార్డుల సంఖ్య పెరిగితే దాని ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. వార్డుల సంఖ్య 45 వరకు పెరిగే అవకాశం ఉందని రాజకీయ, అధికార వర్గాలు పేర్కొన్నాయి. అధికారంలో ఉన్న పాలకులు తమ అభ్యర్థులు గెలుపుకు ఇబ్బందులు తలెత్తే చో ట్ల కులాలు, సామాజిక ఓటర్లను బేరీజు వేసుకొని చాకచక్యంగా పునర్విభజన నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.




## రేపు మడకశిరలో కృతజ్ఞతా ర్యాలీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.

**మడకశిర టౌన్ మార్చి 24 ప్రభాతవార్త**

తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది సంతోషించేలా ఆర్డిటి సేవలు యథావిధిగా కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరిపి పేదల ఇళ్లలో వెలుగు, నిరుపేద పిల్లల చదువు, ఉపాధి, ఆర్థిక సాధికారత, వైద్య సేవలు అందించే ఆర్ డి టి దశాబ్దాలుగా చేస్తున్న కృషికి మద్దతుగా యఫ్ సి ఆర్ ఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) ప్రకారం ఆర్ డి టి రెన్యువల్ చేయించిన శుభ సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ కి, హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా కి, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, యువనేత నారా లోకేష్ లకు ధన్యవాదాలు తెలియజేస్తూ రేపు అనగా 25032026 వ తేది బుధవారం ఉదయం 10.30 గంటలకు మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుండీ జ్యోతిబా పూలే సర్కిల్ వరకూ కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. కావున ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, ఆర్డిటి లబ్ధిదారులు, మహిళలు, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వక్కలిగా రాష్ట్ర చైర్మన్ లక్ష్మీనారాయణ. మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి. మండల కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్ట్ ఫుడ్, కూల్ డ్రింక్ లకు దూరంగా ఉండండి



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కేశవులు

**హిందూపురం టౌన్ మార్చి 24 ప్రభాతవార్త**

వేసవిలో విద్యార్థులు శీతల పానీయాలు ఫాస్ట్ ఫుడ్ కు దూరంగా ఉండాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేశవులు సూచించారు. మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా చిన్న పిల్లల వైద్యుల సమాఖ్య వారి 41 వ"సంకల్ప్ సంపూర్ణ స్వాస్థ్య "బడి పిల్లల జాతీయ ఆరోగ్య అవగాహనా కార్యక్రమం పట్టణం డి.ఆర్.కాలనీ లో వున్న లిటిల్ కాబ్స్ ప్రీస్కూల్ నందు జరిగింది. పాఠశాల కరెస్పాండంట్ తేజశ్రీ, ఉపాధ్యాయిలు ఆధ్వర్యం లో పిల్లల తల్లితండ్రులతో కలిసి కార్యక్రమం నిర్వహించినట్లు సమాఖ్య అధ్యక్షులు, కార్యక్రమం కోఆర్డినేటర్, హిందూపురం ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ విశ్రాంత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేశవులు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి కీలకమైన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఇంటిలో అమ్మ చేసిన ఆహారం మాత్రమే తినిపించడం ఉత్తమమని, బజారు ఆహారాలు వద్దని, హానికరమైన రంగు, రుచి, వాసన కెమికల్స్ వున్న ఆహారం, శీతల పానీయాలు, అధిక మోతాదులో షుగర్ కలిపివున్న పళ్ళ రసాలు, అధిక క్రొవ్వు, ఉప్పు, తీపి జంక్ ఫుడ్ మంచిది కాదు అని చెప్పారు. నిత్యం ఒకగంట వ్యాయామం తమతోపాటు చేయించాలని, మొబైల్ ఫోన్ కు దూరంగా వుంచాలని, సీజన్లో లభ్య మయ్యే పండ్లు తినిపించాలని మొదలగు విషయాలు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా చెప్పారు.

## సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా మనిషికి ప్రశాంతత

**అమరాపురం మార్చి24 ప్రభాతవార్త**



సన్మానం చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని హాలుకూరు గ్రామం నందు వైకాపా రాష్ట్ర బీసీ విభాగపు ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు ఆధ్వర్యంలో గ్రామ యువకులు హోరి హోదా బణ్ణద చిట్టె అనే కన్నడ కౌటుంబిక సామాజిక నాటక ప్రదర్శ,నను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాలుకూరు కాంతరాజు తో పాటు వైకాపా మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప లు పాల్గొన్నారు. గ్రామంలో అన్ని వర్గాల యువకులను చేర్చుకొని సాంస్క ృతిక కార్యక్రమాలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమని ఈ సందర్భంగా కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గ్రామాలలో కక్ష కార్పాన్యాలు లేకుండా అన్ని వర్గాలు కలిసిమెలిసి ఉండడానికి అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నియోజకవర్గం వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉప్పార్లపల్లి శివన్న, వైకాపా నాయకులు హాలుకూరు సురేష్, ఎంపిటిసి లు హనుమంతరాయ, నారాయణ గౌడ్, మండల వైకాపా అధ్యక్షుడు త్రిలోక్నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన ప్రముఖులకు మరియు కళాబృందానికి వాద్య గోష్టి వారికి డ్రామా మేనేజర్లు విజయ్ కుమార్, రామ్మూర్తి, గోపాలకృష్ణ, గంగాధరప్ప తదితరులచే ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా నాటక ప్రదర్శన నిర్వహించడం ద్వారా గ్రామంలో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు

## యుటిఎఫ్ రణభేరి 3.0 పెనుకొండలో నిరాహారదీక్ష

ఆర్డీఓ ఆనంద్ కుమార్ కు వినతి.



ఆర్డీఓ కు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు.

**పెనుకొండ మార్చి 24 ప్రభాతవార్త.**

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సత్యసాయి జిల్లాశాఖ పిలుపుమేరకు పెనుకొండ నియోజకవర్గం కేంద్రంలో రణభేరి 3.0 లో భాగంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సి.నరేష్ కుమార్ అధ్యక్షతన ఒకరోజు నిరాహార దీక్షను మంగళవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వము ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చినటువంటి హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వము వెంటనే 12వ పిఆర్సి కమిషన్ను నియమించాలని లేదా ఐ ఆర్ 29 ని ప్రకటించాలని, పెండింగ్లో ఉన్నటువంటి ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, హెల్త్ స్కీములకు సంబంధించినటువంటి సమస్యలను తీర్చాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం. సుధాకర్, ఈ. నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షురాలు గౌరమ్మ, జిల్లా కార్యదర్శి పాళ్యం మురళి, జిల్లా ఆడిట్ సభ్యులు కిష్టప్ప, రమేష్,ఆది, దినేష్ జైన్, పెనుగొండ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు,రవీంద్ర ,రొద్దం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సానిపల్లి గంగాధర్, మారుతి,మండల ఆడిటర్ రామకృష్ణ సార్, గోరంట్ల మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, కాశి అశోక్,చిన్న వెంకటేశు, ఓబులేషు,విష్ణు, వినోద్,నాగార్జున, కుళ్లాయప్ప,ఇద్దైతుల్లా నరసింహులు,తిప్పే స్వామి దివాకర్,వర్మ, లాల్ పీర్, గోవిందప్ప,మహిళా యుటిఎఫ్ సభ్యులు రాధమ్మ,,దేవేంద్రమ్మ, పద్మావతి, ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థాన నిర్మాణానికి సహకరించండి

మండల కాపునాడుఅధ్యక్షుడు



విన్నవిస్తున్న కాపునాడు అధ్యక్షుడు

**అమరాపురం మార్చి 24 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వలస గ్రామంలో ఉన్న చింత తోపు లోని శ్రీ కైవార యోగి నారాయణ స్వామి దేవాలయ నిర్మాణానికి 2014 టిడిపి ప్రభుత్వం అనుమతులను మంజూరు చేస్తూ పొజిషన్స్ కూడా మంజూరు చేయడం జరిగిందని కాపునాడుమండల అధ్యక్షుడు విద్యా సాగర్ తెలిపారు. కానీ ఆనాటి తెదేపా తమ్ముళ్లు ఉద్దేశపూర్వకంగా నిర్మాణాన్ని ఆపేశారు. తదనంతరం వైసిపి అధికారంలోకి రావడంతో దాన్ని నిర్మాణం ఎక్కడ ఉండేది అక్కడే ఉండిపోయింది. ఇప్పుడైనా సరే కూటమి ప్రభుత్వం దేవస్థాన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి అన్ని విధాలుగా ఆదుకోవాలని మండల కాపునాడు అధ్యక్షుడు జి విద్యాసాగర్ కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులను విన్నవించుకుంటున్నారు. ఇప్పుడైనా ప్రభుత్వ పెద్దలు అధికారులు స్పందించి ఆ దేవాలయ నిర్మాణానికి అన్ని విధాలుగాసహకరించాలని మరియు ఆ స్థలానికి పొజిషన్స్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కాపునాడు కుల బాంధవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ దేవాలయ నిర్మాణానికి ఆర్థికంగా కూడా సహకరించాలని కాపు నాయకులు తెలియజేస్తున్నారు. వలస గ్రామపంచాయతీలో దాదాపు 100 నుంచి 120 కాపునాడు కుటుంబాలు నివసిస్తున్నారు. వారందరికీ ఇంటి దేవుడైనటువంటి కైవార యోగి నారాయణ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి సహకరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాపు హనుమంత రాయుడు, కాపు విశ్వనాథ్, కాపు చంద్రశేఖర్, కాపు రామకృష్ణ, కాపు యశ్వంత్, కాపు మంజునాథ్ మరియు కాపు కుల బాంధవులు భారీగా పాల్గొన్నారు.

## "ఆత్మీయ ట్రస్ట్" ద్వారా వృద్ధాశ్రమంలో ఉచిత కంటి అద్దాలు పంపిణీ: డిప్యూటీ డిఎంహెచ్ఓ భాగ్యలక్ష్మి



వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

**తాడిమర్రి మార్చి 24 (ప్రభాతవార్త)**

మండల పరిధిలోని నారసింపల్లి గ్రామంలో గల వృద్ధాశ్రమంలో గత నెల 6 తారీకు న కంటి పరీక్షలు నిర్వహించి 10 మంది వృద్ధులకు కంటి అద్దాల అవసరం అని, 5 గురి వృద్ధులకు కంటి ఆపరేషన్ అవసరమని డాక్టర్ ఊరుకుందప్ప నిర్ధారించారు. నాడు నిర్ధారించిన వృద్ధులకు మంగళవారం (2432026) అవసరమైన పది మంది వృద్ధులకు ధర్మవరం కు చెందిన "ఆత్మీయ ట్రస్ట్" ద్వారా ధర్మవరం డిప్యూటీ డి ఎం హెచ్ ఓ అధికారి డాక్టర్ భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిమర్రి వైద్యాధికారి హరిత, నేత్రవైద్యాధికారి ఊరుకుందప్ప, సీవో లక్ష్మీనారాయణ, సిహెచ్ఓ అలేఖ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వయోవృద్ధులు పాల్గొన్నారు,

## ఆర్డిటి కి అనుమతులు పునరుద్ధరించినందుకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**పుట్టపర్తి టౌన్, మార్చి24, ప్రభాతవార్త**



ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి (ఫైల్ ఫోటో)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు విద్య ,వైద్యం,భూగర్భ జలాల పెంపు,పేదల జీవనోపాదుల అభివృద్ధి కోసం అనేక సేవలందిస్తున్న రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఏ ను పునర్ధరించినందుకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి,ప్రధాని మోడీ ,కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు ,వీటికి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్డిటి కృషి ఫలించేలా అన్ని విధాలుగా అండగా నిలిచిన మనరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్ కృషితో నిత్యం వీటి కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిన కేంద్ర టిడిపి మంత్రులు,ఎంపీలు ఉమ్మడి జిల్లాలకు చెందిన రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డిటి సంస్థ కు ఎఫ్ సి ఆర్ ఏ ఇచ్చిందుకు మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మీడియా తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సంస్థ లక్షలాదిమంది పేదలకు జీవనోపాదుల అభివృద్ధి,గృహ నిర్మాణం,పేద క్రీడాకారులకు క్రీడల్లో ప్రోత్సాహంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను ఇటు ఏపీతోపాటు తెలంగాణ రాష్ట్రాల్లో కొనసాగిస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయంలో నిలిచిపోయిన ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ ను పునర్ధరించేలా ఏనాడు కేంద్ర ప్రభుత్వంపై గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదన్నారు.ఆర్డిటికి ఎఫ్ సి ఆర్ ఏ వచ్చినందుకు ఆ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ మంచు ఫెర్రర్ కు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

- 2030 నాటికి క్షయ రహిత భారత్ లక్ష్యం




క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డిఓ

**శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము మార్చి 24 ప్రభాతవార్త**

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఆర్డీవో సువర్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజాన్ని క్షయ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ర్యాలీ కార్యాలయం నుంచి వైజంక్షన్ వరకు సాగింది.డీఎంహెచ్ఓ డా. పై రోజా బేగం, జిల్లా టిబి ప్రోగ్రామ్ అధికారి డా. అనుపమ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు."క్షయను అంతం చేద్దాం – దేశాన్ని రక్షిద్దాం","దగ్గు, జ్వరం ఉంటే నిర్లక్ష్యం వద్దు" వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత పరీక్షలు, మందులు, పోషకాహార పథకాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.2030 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించారు.

## ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చారిత్రాత్మకం

-మోదీ, చంద్రబాబు, పవన్ ల చిత్రపటాలకు పాలాభిషేకం



కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మండల కూటమి నాయకులు

**బత్తలపల్లి, మార్చ్ 24 ప్రభాతవార్త**

ఆర్డిటి సంస్థకు ఎఫ్సిఆర్ఏ రెన్యువల్ సమస్యను పరిష్కరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ల చిత్రపటాలకు బత్తలపల్లి నాలుగు రోడ్ల కోడలిలో కూటమి నాయకులు పాలాభిషేకం చేశారు. మంగళవారం కూటమి నాయకులు ప్రధాని, ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కూటమి నాయకులు మాట్లాడుతూ పేదల సంస్థగా పేరుగాంచిన ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ మంజూరు చేయడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జులు నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, బీజేపీ నాయకులు వీరనారప్ప, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, యూనిట్ ఇంచార్జ్ బత్తల మనోజ్, బోయపాటి రాము, గోనుగుంట్ల పరేష్, పల్లపోతల శ్రీరాములు, దేరంగుల హరి, ప్రతాప్, వీరా, నాగార్జునరెడ్డి, లిలీ శుభహాన్, బొజ్జప్ప, మాతంగి హరి, శ్రీనివాస్, రమణప్ప, దామోదర్, దిలీప్, కుంటాల బాల, కృష్ణమూర్తి, వెంకటరాముడు, రమేష్ బాబు, అప్పస్వామి, సదాశివా, మోలా,మూళ్ళగురు గోపాల్, మాల్యా వంతం బాబు, చెంద్రశేఖర్, కృష్ణయ్య, విశ్వనాథ్, దురగమప్ప, బాలకృష్ణ, గౌతమ్, చంద్రశేఖర్ గౌడ్, శంకర్, గంగాధర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు

ఒకరి అరెస్టు రిమాండ్ కు తరలింపు

**ధర్మవరంటౌన్ , మార్చి 24 ప్రభాతవార్త**



నాటుసారా స్వాధీనం చేసుకున్న దృశ్యం

అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య గారి ఆదేశాల మేరకు మండలంలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామ శివారులో నాటుసారా తయారీ దారులు, అమ్మకం దారులపై మంగళవారం దాడులు చేసి ఒకరిని అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి లీటరు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు ధర్మవరం ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రమణి తెలిపారు. బుడ్డారెడ్డిపల్లి గ్రామ శివారులో నాటుసారా తయారీ చేస్తున్నట్టు సమాచారం రావడంతో దాడులు చేసి బుడ్డారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరి కేశప్పను అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి ఒకలీటరు నాటుసారా స్వాధీనంచేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా జడ్జీ డిమాండు ఆదేశించారని సీఐ తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారుచేసినా విక్రయించినా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

## ఎఫ్సీఆర్పీ పునరుద్ధరణ అభినందనీయం

**ధర్మవరంటౌన్ , మార్చి 24 ప్రభాతవార్త**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది గ్రామాల్లో స్వచ్ఛంద సేవలందిస్తున్న ఆర్డీటీ ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడం ఆనందంగా ఉందని టీడీపీ మండల సీనియర్ నాయకులు రేగాటిపల్లి వరదరాజులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్ సీ ఆర్ఏ రెన్యూవల్ చేయడం వల్ల ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్రమంత్రి అమిత్, సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి అనంతలో ఆర్డీటీ ద్వారా ఎంతో మంది లబ్దిపొందారన్నారు.జగన్మోహన్రెడ్డి సీఎంగా ఉన్నప్పటి నుంచి ఎఫ్ సీఆర్ ఏ రెన్యూవల్ సమస్య విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. కూటమి ప్రభుత్వం ఆసమస్యను పరిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ఆర్డీటీకి కష్టం వస్తే... అది జిల్లా ప్రజలకు కష్టం వచ్చినట్టే

ఈ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి రానివ్వం నారాలోకేశ్ అలుపెరగని కృషివల్లే సాధ్యంపరిటాలశ్రీరామ్



మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

**ధర్మవరంటౌన్ , మార్చి 24 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాకు జీవనాడి లాంటి ఆర్డీటికి కష్టం వస్తే ప్రజలకు కష్టం వచ్చినట్టేనని దానిని ఈ ప్రభుత్వం రానివ్వదని నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. ఆర్డీటికి ఎఫ్ సీఆర్ఎ రెన్యూవల్ చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన మంగంళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా సంస్థ నిర్వహణపై చాలా మందికి ఆందోళన ఉండేదని, కానీ వాటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. ఇది జిల్లా ప్రజలకు ఒక పండుగ లాంటిదన్నారు. ఇది సీఎం చంద్రబాబునాయుడు,మంత్రి నారాలోకేశ్ కృషివల్లనే సాధ్యమైందన్నారు. ఆర్డీటీకి ఎఫ్ సీ ఆర్ఎ ఆగినప్పుడు తాము సీఎం, మంత్రినారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు వారు ఈ ప్రాంత ప్రజలకంటే ఎక్కువగా ఆలోచించారన్నారు. ఇది వారి బాధ్యతగా ఆర్డీటీ అంటే అభిమానంతో సమస్యను పరిష్కరించేలా చొరవ చూపారన్నారు. డిల్లీలో మన ఎంపీలతో ఒక బృందాన్ని ఏర్పాటుచేసి అడ్డంకులను తొలగిస్తూ వచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాను ను కలిసి సమస్యను వివరించి ఆర్డీటికి ఎఫ్ సీ ఆర్ ఏ రెన్యూవల్ సాధించారన్నారు.1970 నుంచి పాదర్ ఫెర్రర్ జిల్లా ప్రజలకు అందించిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పు కోవాల్సి న అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం గృహనిర్మాణంలో లక్షలమందికి సాయం చేశారన్నారు.

## రెవెన్యూ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం : జెసి భరద్వాజ్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి భరద్వాజ్

**పుట్టపర్తి (కలెక్టరేట్), మార్చి 24, ప్రభాతవార్త**

జిల్లాలో రెవెన్యూ పాలనను బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని జాయింట్ కలెక్టర్ భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నందు అధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతిక సమస్యలను అధిగమించి రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు తప్పుల్లేని పాస్ పుస్తకాలు అందించాలని ఆదేశించారు. 22ఎ, చుక్కల భూములు, మరియు సరిహద్దు వివాదాల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్యాస్ పంపిణీ సజావుగా సాగాలనీ, వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఎటువంటి అంతరాయం లేకుండా, సక్రమంగా జరగాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా తీరును ,డోర్టుడోర్ డెలివరీ విధానం అమలుపై ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయసారధి, డిఎస్ఓ వంశీకృష్ణ రెడ్డి , జిల్లాలోని ఆర్డీఓలు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదు

ఆర్డీవో ఆనంద్ కుమార్



ఆర్డిఓ ఆనంద్ కుమార్

**పెనుకొండ మార్చి 24 ప్రభాతవార్త**

పెనుకొండ డివిజన్ లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ లకు ఎటువంటి కొరత లేదని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆనంద్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కొంతమంది వినియోగదారులు గ్యాస్ కొరత వస్తుందనే అపోహతో అధికంగా బుకింగ్ చేసు కోవడం వల్ల కొన్నిసార్లు సర్వర్ సంబంధిత సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, అయితే గ్యాస్ సరఫరాలో ఎలాంటి లోపం లేదని ఆయన స్పష్టం చేశారు.గ్యాస్ సరఫరా లేదా బుకింగ్కు సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైనా, రెవిన్యూ డివిజనల్ అధికారి కమాండ్ కంట్రోల్ నెంబర్ 7207465274 ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అలాగే,గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు,తోపుడు బండ్లు మరియు వాణిజ్య సముదాయాలు వంటి వ్యాపార అవసరాలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఎవరైనా కృతిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్లో సిలిండర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత వ్యక్తులపై నిత్యావసర వస్తువుల చట్టం, 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు కూడా వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ సిలిండర్లు సరఫరా చేస్తే వారి మీద కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.డివిజన్ లోని ప్రతి మండలంలోని తహసీల్దార్లు మరియు పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు ప్రతిరోజు గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేసి స్టాక్ నిల్వలను పరిశీలిస్తూ గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తమ మండల పరిధిలో హోటళ్లు, తోపుడు బండ్లు లేదా వాణిజ్య సముదాయాలలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించినట్లయితే తక్షణమే చర్యలు తీసుకుని నిత్యావసర వస్తువుల చట్టం, 1955 మేరకు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

## 407 వాహనం వరి కోత యంత్రం ఎదురెదురుగా ఢీ

104 డ్రైవర్ కి స్వల్ప గాయాలు




రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న 407 వాహనం.

**కొత్తచెరువు మార్చి 24 ప్రభాతవార్త**

కొత్తచెరువు మండలం కేంద్రం ధర్మవరం రోడ్డు ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో 407 వాహనం, వరి కోత యంత్రం ఎదురెదురుగా బలంగా ఢీ కొనడంతో 407 వాహనం ముందు భాగం నుజ్జు , నుజ్జు అయిన సంఘటన చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలు మేరకు కొత్త చెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన రవీంద్ర 407 వాహనంలో అనంతపురం కి చీనా కాయలు లోడు చేసుకుని వెళ్లే మార్గంలో, కొత్తచెరువు మండలం వంగంపల్లి గ్రామానికి చెందిన నారప్ప కుమారుడు రఘు వరి కోత యంత్రం తో బలంగా ఢీకొనడంతో 407 వాహనం ముందుభాగం పూర్తిగా దెబ్బ తిన్నదన్నారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిపై కేసు నమోదు చేసి దాని పై దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి మారుతి శంకర్ తెలిపారు ఈ ప్రమాదంలో 407 డ్రైవర్ రవీంద్ర స్వల్ప గాయాలు అయ్యాయి ఈ రోడ్డు ప్రమాదంలో ఎవరికి కూడా ఎలాంటి ప్రాణహాని కలగలేదని సిఐ తెలిపారు

04ATP24_04ATP24.qxd 24-03-2026 PM 11:39 Page 1



# లక్షలాది పేదలకు ఊరట-ఆర్‌డిటి కార్యకలాపాలకు మళ్లీ మార్గం సుగమం..!
## - ఎంపి అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం, మార్చి 24 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం జిల్లాలో లక్షలాది పేద కుటుంబాల జీవితాలకు ఆధారంగా నిలిచిన రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటికి) సంబంధించిన సమస్యలు పూర్తిగా పరిష్కారమవడం పట్ల అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ప్రభాత వార్తతో మాట్లాడుతూ.. కరువు, పేదరికం, వెనుకబడిన పరిస్థితుల్లో జీవిస్తున్న అనంతపురం ప్రజలకు ఆర్డిటి అనేది ఒక ఆశాకిరణం. దశాబ్దాలుగా ఈ సంస్థ విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సాధికారత రంగాల్లో వేలాది గ్రామాలకు సేవలు అందిస్తూ లక్షలాది కుటుంబాలకు బలంగా నిలిచింది. అయితే విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఏ) అనుమతుల్లో ఏర్పడిన అడ్డంకులు, విదేశీ నిధుల ప్రవాహంలో వచ్చిన అంతరాయం కారణంగా ఈ సంస్థ కార్యకలాపాలు మందగించి, గ్రామీణ అభివృద్ధి పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల అనేక పేద కుటుంబాల్లో అనిశ్చితి, ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉమ్మడి అనంతపురం జిల్లా మంత్రులు, శాసన సభ్యులు కేంద్ర ప్రభుత్వంతో అనేక చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి విశేష కృషి చేశారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఎంపీ శ్రీ అంబికా లక్ష్మీనారాయణ గారు పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, అనంతపురం ప్రజల ఆవేదనను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇకపై ఆర్డిటి సేవలు మరింత వేగంగా కొనసాగి, గ్రామీణ అభివృద్ధికి కొత్త ఊపిరి పోస్తాయని, అనంతపురం అభివృద్ధికి ఇది ఒక కీలక మలుపుగా నిలుస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.


ఎంపి అంబికా లక్ష్మినారాయణ

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

కదిరి, మార్చి 24 ప్రభాతవార్త

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం రికార్డులు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయంకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, పారదర్శకత పాటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దస్తావేజులను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యాలయంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం కార్యాలయ పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో పాటు ఆర్డిఓ వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, స్థానిక సబ్ రిజిస్ట్రార్ సురేష్ ఆచారి, తహశీల్దారు రెడ్డిశేఖర్‌లు పాల్గొన్నారు.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్


కార్యాలయం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# పురపాలక పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే - మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా

గుంతకల్లు, మార్చి 24 ప్రభాతవార్త

పట్టణంలోని రాజేంద్రప్రసాద్ పురపాలక ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే స్కూల్ కిట్‌ను అందించి విద్యార్థులను ప్రోత్స హిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు బోధన అందించాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బోయ గుణశేఖర్, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, మండల విద్యాధి కారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు, నాయకులు తలారి మస్తానప్ప, కూటమి నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

# గ్రామ పంచాయతీల మధ్య పోటీ వాతావరణం సృష్టించండి
## .. జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్

శ్రీ సత్య సాయి జిల్లా, మార్చి 24, ప్రభాతవార్త ప్రతినిధి

మండల వారీగా ర్యాంకులు ఇచ్చి గ్రామపంచాయతీల మధ్య పోటీ వాతావరణం సృష్టించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పలు కీలక అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాసా కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, గ్రామపంచాయతీలలో తడి , పొడి చెత్త వేరు చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ కంపోస్టింగ్ చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి రోడ్ ప్రాంతంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో బోర్‌వెల్స్ అద్దెకు తీసుకోవాలని తెలిపారు. మోటార్ లోపాలు, పైప్‌లైన్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. గృహనిర్మాణ కార్యక్రమ పురోగతిని సమీక్షిస్తూ, ధర్మవరం నియోజకవర్గంలో పెండింగ్ గృహాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 409 గృహాలు పూర్తి కాగా, 2,771 గృహాలు పూర్తికి చేరువలో ఉన్నాయని తెలిపారు. ధర్మవరం (165), హిందూపురం అర్బన్ (43), కదిరి అర్బన్ (41) ప్రాంతాల్లో పెండింగ్ గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముదిగుబ్బ, గోరంట్ల మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సుల (సి ఎస్ సి) పురోగతి తక్కువగా ఉన్న అమరాపురం, ముదిగుబ్బ మండలాల్లో పనులు వేగవంతం చేయాలని, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, గ్రామ సచివాలయాల్లో వాటి వినియోగాన్ని నిర్ధారించాలని సూచించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ సేవల్లో బయోమెట్రిక్ హాజరు మెరుగుపరచాలని, ఆదేశించారు. పి ఎం సూర్యఘర్ పథకం అమలును వేగవంతం చేసి ప్రతి వారం కనీసం 200 సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

# ఒక్క రోజు పోరాటం చేయని టిడిపి ఎఫ్‌సిఆర్‌ఏ సాధించిందా..!
## - జిల్లా వైసిపి నేతలు విమర్శలు - ప్రజల సహకారంతోనే ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ సాధ్యమైంది

అనంతపురం సిటీ, మార్చి 24 ప్రభాతవార్త

ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ సాధన కోసం ఒక్క రోజు కూడా పోరాటం చేయని టిడిపి నేడు తమ వల్లే ఎఫ్‌సిఆర్‌ఏ వచ్చిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని వైసిపి నేతలు విమర్శించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, మాజీ ఎంపి, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయ కర్త తలారి రంగయ్యలు వేరువేరుగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 2025 ఏప్రిల్ 21న కేంద్ర ప్రభుత్వం ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్దరణను నిలిపివేయడంతో సంస్థ సేవలు నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో వైసిపి అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వైసిపి ఆధ్వర్యంలో ఉద్యమాలను చేపట్టామన్నారు. అంతేకాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాను లేఖరాయడం జరిగిందన్నారు.

వైసిపి ఎంపిలు సైతం ఆర్డిటి ఎఫ్‌సి ఆర్‌ఏ పునరుద్దరణ కోసం అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. ఆర్డిటి పరిరక్షణ కోసం వైసిపి నేత లు ప్ర జా సంఘాలతో కలిసి ఏడాదిపాటు పోరాటాలు చేసిందన్నారు. కూట మి నేతలు ఒక్కరోజు కూడా నిరసన చేపట్టలేదని గుర్తు చేశారు. అయితే నేడు క్రెడిట్ చోరీలో భాగంగా ఆర్డిటి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్దరణను తమ ఖాతాలో కూటమి ప్రభుత్వం వేసుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. మాజీ ఎంపి తలారి రంగయ్య మాట్లాడుతూ.. తమ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కళ్యాణ దుర్గం నుంచి ఉద్యమాన్ని ప్రారంభించాలని తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. తన ఆధ్వర్యంలో చేపట్టిన పాద యాత్రను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున పోలీసు యంత్రాంగాన్ని మోహరించిన తీరును ప్రజలంతా చూశారన్నారు. పోలీసు ఆంక్షలను లెక్క చేయకుండా పాద యాత్రలు, బైక్ ర్యాలీలు, లక్ష పోస్టు కార్డుల ఉద్యమం, ఢిల్లీలో నిరసన కార్యక్రమాలను చేపట్టి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. తమ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారని గుర్తు చేశారు. ప్రజల పోరాట ఫలితమే ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్దరణ అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్దరణ కోసం జరిగిన పోరాటంలో స్వచ్ఛందంగా పాల్గొని ఎఫ్‌సిఆర్‌ఏ సాధించుకున్న జిల్లా ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపి తలారి రంగయ్య

# కమ్యూనిస్టు యోధులు కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం
## - సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త

పేదల పక్షపాతి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ఆశయాలు కొనసాగిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్ పేర్కొన్నారు. మండలంలోని వేముల పాడు గ్రామంలో కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి తృతీయ వర్ధంతిని ఆయన కుమారుడు వికె ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహం ఆవరణంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, అభిమానులు, రైతులు, కార్యకర్తలు కమ్యూనిస్టు యోధుడు దివంగత కామ్రేడ్ వికె వెంకట రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. జాఫర్ మాట్లాడుతూ కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి భారత కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్య మంపై ఆకర్షితులై అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్‌లో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. యాడికి మండలంలోని వేములపాడు గ్రామ పంచాయతీ సర్పంచుగా సొసైటీ సింగిల్ విండో అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారని, భూస్వామ్య పెత్తందారులకు ఆ ప్రజా స్వామిక పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో ముందు వరుసలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం లో దాదాపు 72 మంది స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. అనంతరం స్వచ్ఛంద సేవకులు, సేవా కార్యక్రమాలు పలు సేవలు అందించిన వారిని శాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాడిపత్రి నియో జకవర్గ కార్యదర్శి రంగయ్య, సీనియర్ నాయకులు ఎద్దుల సూర్య నారాయ ణరెడ్డి, యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్‌రఫీ, మార్పు డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఛైర్మన్ అమర్నాథ్‌రెడ్డి, పెద్దవ డుగూరు మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్, సిపిఐ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి, నీలూరు లక్ష్మయ్య, సర్పంచు ఓంకారమ్మ, శ్యామ్ సుందర్‌నాయుడు, జూటూరు బషీర్, గుత్తి కార్యదర్శి రాందాస్, నారాయణ, చిన్న కుల్లాయిరెడ్డి, జూటూరు అర్షద్, కుల్లాయిరెడ్డి, సాంబశివుడు, రసూల్, వికె అభిమానులు, సిపిఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


వికె వెంకటరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# చెవుల్లో పూలు పెట్టొద్దు. లెక్కలు చెప్పండి
## కనీసం ఒక టీఎంసీ నీటినైనా పేరూరు డ్యాంకు తీసుకొచ్చారా. - పరిటాల సునీత, అమిలేని సురేంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదు - డ్యాంకు నీటిని వదిలితే కింద ఉన్న ఇసుకను అమ్ముకోలేమనే స్వార్థంతో మీరు పేరూరు డ్యాంకు నీళ్లు రాకుండా చేశారు - 2002కు పూర్వం ఉన్న కరువు పరిస్థితులు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయి.రాప్తాడు మాజి ఎమ్మెల్యే, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం.

అనంతపురం రూరల్, మార్చి 24 ప్రభాతవార్త :

చరిత్రలో ఎప్పుడూ లేనంతగా హంద్రీనీవా కాలువ ద్వారా రాయలసీమ జిల్లాలకు 8 నెలల్లో 52 టీఎంసీల నీటిని తెచ్చామని చెబుతున్నారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 43 టీఎంసీల నీరు చేరిందని చెబుతున్నారు. మరి చిత్తూరు జిల్లా కుప్పంకు నీరు తీసుకెళ్లేందుకు 3850 కోట్లు ఖర్చు చేసి కాలువకు లైనింగ్ చేశారు. మరి ఇందులో కుప్పంకు ఎన్ని టీఎంసీల నీళ్ల తీసుకెళ్లింది చెప్పడం లేదు. అన్ని కోట్లు ఆర్నెళ్లల్లో ఖర్చు చేసింది కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకానేతల కమీషన్ల కోసమా? పేజ్-2లో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాను ఎండబెట్టడానికా?. మీరు హంద్రీనీవా ద్వారా తెచ్చామంటున్న నీటిలో ఏ మేరకు చిత్తూరు జిల్లాకు తీసుకెళ్లారు, ఎంత నీరు చెరువులకు నింపారు, ఎంత నీరు భూగర్భజలాలకు వెళ్లిందో శ్వేతపత్రం విడుదల చేయాలని. చెవుల్లో పూలు పెట్టొదనిలెక్కలుచూపించాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లా డుతూ హంద్రీనీవాకా లువకిరుడఉన్నగ్రామాలను పరిశీలించండి. హంద్రీనీవా కాలువకు లైనింగ్ పనులు చేయడం వల్లభూగర్భజలాలు ఇంకిపోతాయి. గతంలో ఏటా సుమారు 50 టీఎంసీల దాకా హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్ల వచ్చినా చెరు వులు నింపడం పోనూ తక్కిన నీరంతా భూగర్భజలాలు పెరిగేవి. వైఎస్ఆర్ హంద్రీనీవా కాలువను తీసుకురావడం వల్లే జిల్లా రైతులు ఈరోజు నీటిని చూస్తున్నారని,మీరు చేసిన లైనింగ్ పనుల్లో సుమారు వెయ్యికోట్ల దోపిడీ జరిగింది. అదే 3850 కోట్లతో 60 శాతం పనులు పూర్తయిన గాలేరు-నగరి నుంచి చిత్తూరు జిల్లాకు హంద్రీనీవా నీరందించే లిఫ్ట్‌ఇరిగేషన్ స్కీమ్‌ను పూర్తి చేసిందొచ్చు. అలాగే హంద్రీనీవా పేజ్-2లో దాదాపు 4లక్షల ఎకరాల ఆయకట్టుకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను ఏర్పాటు చేసిందొచ్చు. పిల్ల కాలువలను ఏర్పాటు చేసిందొచ్చుని అలా కాకుండా కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి హంద్రీనీవా లైనింగ్ పనులు చేపట్టారు. దుర్మార్గ పాలనలతో ఈ ప్రాంతం కరువుపీడిత ప్రాంతంగా మారుతోందని, టమాటా పంటను రోడ్లపై పడేస్తున్నారు. అరటికి గిట్టు బాటు ధరలేదు. ఉల్లిగడ్డ ధర పూర్తిగా పడిపోయింది. అన్న దాతను ఇబ్బంది పెట్టిన ఈ ప్రభుత్వం నాశనం అవుతుం దన్నారు. 110 గ్రామాలకు తాగునీటి కల్పించేందుకు పీఏ బీఆర్ నుంచి 90 కోట్లు ఖర్చు తో పనులు ప్రారంభిస్తే ఈరోజు అతీగతీ లేదు. తాగునీరు లేక గ్రామాల్లోవిలవిలలాడుతున్నారు. మహి ళలు బిందెలు పట్టుకుని రోడ్డెక్కు తున్నారు. కమీషన్ల కోసం కాంట్రాక్ట ర్లను బెదిరిస్తున్నారు తప్పితే పనులు చేయించడం లేదు. వారికి బిల్లులు చెల్లిం చడం లేదని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి రామగిరి, సీకేపల్లి మండలాలకు తాగునీరు ఇచ్చే కార్యక్రమానికి మేము శ్రీకారం చుట్టాం. ఆ పథకానికి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ప్రారం భించారు. కానీ ఇప్పటిదాకా పరిటాల సునీత టెండర్లు పిలిపించలేదు. పాపంపేటలో దోపిడీ చేసిన సొమ్ము చాల్లేదా సునీతమ్మా ఇసుక దోపిడీ సొమ్ము చాల్లేదా,ఇంకా పైపులైను కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు అడుగుతు న్నావు. ప్రజలు మిమ్మల్ని తరిమితరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. మేము ప్రజల్లోకి వెళ్లి మీరు చేస్తున్న అన్యా యాలను ఎండగడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.

# ఆయన సేవలు అనుసరణీయం..!
## : వీకే ఆశయ సాధనకు వక్తల పిలుపు - వీకే వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

యాడికి(తాడిపత్రి), మార్చి 24, ప్రభాతవార్తః

యాడికి మండలం వేములపాడుకు చెందిన కామ్రేడ్ వీకే వెంకట్రామిరెడ్డి సేవలు అందరికీ అనుసరణీయమని, ఆచరణీయ మని పలువురు వక్తలు తెలిపారు. ఆయన మూడవ వర్ధంతి సందర్భంగా వేములపాడులో మంగళ వారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు పార్టీ యోధు నిగా, బడుగు బలహీన వర్గాల తరపున ప్రశ్నించే తత్వంతో ఎన్నో విధాల సామజిక సేవలు అందించిన వీకే వెంకట్రామిరెడ్డి సేవలు ప్రశంసనీ యమని తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. రైతు సమస్యల పట్ల, భూపోరాటాల పట్ల, కార్మిక సమస్య పట్ల వీకే పోరాట పటిమ ఆదర్శనీ యమని సీపీఐ నాయకులు జాఫర్ అన్నారు. కామ్రేడ్ వీకే వెంకట్రామిరెడ్డి కుమారుడు వీకే ప్రదీప్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కమ్యూనిస్టు భావజాలంతో కళాకారుడు దాసు ఆలపించిన విప్లవ, జానపద గేయాలు అభిమానుల ను అలరిం చాయి. వీకే సేవలను అంశాలవారీగా వక్తలు వివరించినప్పుడు కార్యకర్తలు, అభిమానుల నుంచి స్ఫూర్తిదాయకమైన స్పందన లభించింది. ఈ సందర్భంగా మండలంలోనే గాక నియోజకవర్గ వ్యాప్తంగా మానవతా విలువలను చాటుతున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ రెడ్డి, వీకే విశ్వనాథరెడ్డి, రంగయ్య, వెంకటరాముడు యాదవ్, జూటూరు రఫి, రజాక్, తూట్రాళ్లపల్లి మాజీ సర్పంచి శ్యామ్‌సుందర్ నాయుడు, మల్లారెడ్డి, సాంబశివుడు, పుల్లారెడ్డి, కుళ్లాయిరెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


వీకే వర్ధంతి సభలో మాట్లాడుతున్న వక్తలు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన వీకే ప్రదీప్‌రెడ్డి

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
## - పూలకుంటపల్లి పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అమడగూరు, మార్చి 24 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. అమడగూరు మండలం పూలకుంటపల్లి, గోపాల్ నాయక్ తండా, లోకోజిపల్లి గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల్లో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేరవేరుస్తున్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ప్రతిఏటా 20 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 44,345 మంది రైతుల ఖాతాల్లో జమచేస్తున్నారన్నారు. రబి సీజన్‌లో యూరియా కొరత లేకుండా రైతు సేవా కేంద్రం ద్వారా ప్రతి రైతుకు సరఫరా చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధిని బాటలో నడిపిస్తూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానంలోకి తెచ్చారన్నారు. అలాగే మండలంలో ఉన్న పెండింగ్ సిసి రోడ్లను త్వరగా పూర్తి చేయాలని నీటి కొరత, కరెంటు కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేవర శ్యాంబాబు నాయుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నంజప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి వలిపి సోమశే ఖర, ఎంపిడిఓ లోకనాథ్‌రెడ్డి, ఆర్ఐ రామకృష్ణారెడ్డి, రెస్కో ఏఈ చంద్రనా యక్, హౌసింగ్ ఏఈ శివకుమార్, వ్యవసాయాధికారి వెంకట రమణాచారి, ఎన్ఆర్‌జిఎస్ ఏపీవో మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది సర్వేర్ సురేంద్రబాబు, రామానాయక్, బోడెప్ప అలియాస్ వెంకటరమణ, నాగేంద్రరెడ్డి, రామలాల్, కుమార్‌రెడ్డి, రెస్కో రాజారెడ్డి, నియోజకవర్గం మైనార్టీ కార్యదర్శి మహబూబ్‌బాషా, ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్‌నాయక్, రామాంజులు, డీలర్లు తుమ్మిలరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజి, ప్రసాద్, రెడ్డప్ప, రావూఫ్, శంకర్‌నాయుడు, ఇర్షద్, రుఫియాభాను, హాసినభాను, ఎస్‌సి సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్, ఫోటో స్టూడియో మూర్తి, దేవరాజ్, ఈడగుట్ట రామప్ప, పేరవాండ్లపల్లి కృష్ణమూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

# సదస్సులు నూతన ఆవిష్కరణలకు నాంది కావాలి
## - టెక్ ఫెస్ట్2కె26 ప్రారంభ కార్యక్రమంలో జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

అనంతపురం సిటీ, మార్చి 24 ప్రభాతవార్త

విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసే సదస్సులు నూతన ఆవిష్కరణలకు నాంది కావాలని జెఎన్‌టియుఏ విసి సుదర్శనరావు సూచించారు. జెఎన్‌టియుఏ ఆడిటోరియంలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ 2కె26 సదస్సును జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు రిజిస్ట్రార్ కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. టెక్‌ఫెస్ట్ 2కె26 సదస్సులో భాగంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రేస్-2కె26 ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఐ 2కె26 సదస్సును, మెకానికల్ ఇంజినీరింగ్ వవిభాగం డైనమిక్స్ 2కె26 సదస్సును, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ మెర్జ్2కె26 సదస్సును, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం పిక్సెల్ 2కె26 సదస్సును కెమికల్ ఇంజినీరింగ్ వవిభాగంలో ఫ్యూజన్2కె26 సదస్సును నిర్వహించారు. సదస్సులన్నింటినీ కలిపి టెక్‌ఫెస్ట్ 2కె26గా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శనరావు మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులు వల్ల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడుతుందన్నారు. ఇలాంటి సదస్సులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ తెలివి తేటలను ప్రపంచానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలకు నాంది కావాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు కొత్తకొత్త సమస్యలకు కొత్తపరి ష్కారాలను కనుగొనేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. అంతే కాకుండా ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా ఉద్యోగాలు సృష్టించే విధంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులు సరికొత్త ఆలోచనలకు నాంది పలుకుతాయని సూచించారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని మరింత ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెఎన్‌టియుఏ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, సివిల్ విభాగం హెచ్‌ఓడి కోఆర్డినేటర్ అజిత, మెకానికల్ హెచ్‌ఓడి డా.కళ్యాణి, కోఆర్డినేటర్ చంద్రమోహన్‌రెడ్డి, ఇఇఇ విభాగం హెచ్‌ఓడి, కోఆర్డినేటర్ రామశేఖర్, ఈసిఇ విభాగం హెచ్‌ఓడి డా.ఎస్.అరుణ మస్తాని, కోఆర్డినేటర్ డాక్టర్ లలిత కుమారి, సిఎస్‌ఈ విభాగం హెచ్‌ఓడి రాజశేఖర్, కోఆర్డినేటర్ శివకుమార్, కెమికల్ విభాగం హెచ్‌ఓడి కళ్యాణ్‌కుమార్, కోఆర్డినేటర్ శారద, పిఆర్‌ఓ ఓం ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


సదస్సును ప్రారంభిస్తున్న జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు

# జిల్లాకు పథకాలు తెచ్చేలా రాష్ట్రస్థాయిలో రాణించాలి - డిఎస్‌డిఓ మంజుళ

అనంతపురం సిటీ, మార్చి 24 ప్రభాతవార్త

జిల్లాకు గుర్తింపును తీసుకొచ్చేలా రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి మంజుళ సూచించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాప్ లీగ్ పోటీలలో భాగంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను మంగళవారం నీలం సంజీవరెడ్డి స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి మంజుళ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడా కారులను ప్రోత్సహించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసేలా శాప్ లీగ్ పోటీలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 30, 31న గుంటూరులో జరి గిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ పోటీలలో పాల్గొనాల్సి ఉంటు ందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్య లో క్రీడా కారులు పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌జిఎఫ్ కార్యదర్శి సెక్రెటరీ శ్రీనివాసులు, మాస్టర్ అథ్లెటి క్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్‌బాబు, కార్యదర్శి సికిందర్‌తోపాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌డిఓ మంజుళ